

# అగ్రహారం కథలు

## వేదుల సుభద్ర



పేరులో ఒక రకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరి దేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశికగా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచార వ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచి చూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - ***రచయిత్రి(బెంగుళూరు)***

## తత్ + దినము

అగ్రహారంలో తొలిపొద్దు పొడిచింది. ఊరంతటినీ తన సన్నని మేలిముసుగులో బంధించిన తెలిమంచు మెల్ల మెల్లగా పక్కకి తొలగి కొద్ది కొద్ది గా అగ్రహారపు వదనారవిందాన్ని ఆవిష్కరిస్తోంది. బంగారు రంగులో మెరిసిపోతోంది తొలిపొద్దులో గ్రామమంతా.

అమలాపురంలో బస్ దిగి రిక్షా ఎక్కారు విజయ్, అతని తల్లి రాధ. "ఇదే ఆఖరు లాప్ రా నాన్నా, వచ్చేసాము" అంది సంబరంగా కొద్దిగా అలసిన విజయ్ ముఖాన్ని చూస్తూ . అమలాపురం నుంచీ అగ్రహారం వరకూ దారి పొడుగునా ఒక్క క్షణం ఆ-పకుండా మాట్లాడుతూనే ఉంది.

"ఇదే మా స్కూల్

ఇదే మన పెద్దతాతగారి పొలం.

ఈ డొంకల్లోనే చిన్నప్పుడు మేము త్రాచు పామును చూసాము.

ఇక్కడే సుబ్బారాయుడు షష్టి తీర్థం జరుగుతుంది. ఇక్కడ పకోడీలెంత బావుంటాయో.. " ఇలా.

చాలా రోజుల తరవాత వస్తోందేమో.. పట్టరానంత సంతోషంగా ఉందామెకు.

"అబ్బా, అమ్మా ఇవన్నీ నేను కూడా చూసాను కద !ఇంతకుముందు, అయినా నువ్వు రోజూ చెపుతూనే ఉంటావు కూడా. ఇప్పుడిక్కడ అగ్రహారానికి సంబంధించిన పరీక్ష పెట్టు, ఎన్ని మార్కులు వస్తాయో చూడు! " అన్నాడు చిలిపిగా.

ఇరవై నిముషాల ప్రయాణానంతరం "ఇక్కడే ఆపు బాబు" అని గట్టిగా అరిచినంతగా చెప్పింది అతనికి. పూర్తిగా ఆగనైనా - ఆగకుండానే దిగిపోయింది. విజయ్ కూడా దిగి, రిక్షా అతనికి డబ్బు ఇచ్చి పెట్టె, బాగ్ తీసుకుని తల్లి వెనక నడిచాడు తాతగారింట్లోకి.

వీధి అరుగు మీదకూర్చుని పేపర్ చదువుకుంటున్నారు తాతగారు. రాధని చూసి.

"అమ్మా, పాపా! నువ్వేనా? ఇదేనా రావడం? అల్లుడు రాలేదూ, మన విజయే? ఎంత పొడుగయిపోయాడో? అనంతం! ఎవరొచ్చారో చూడు? " అని గట్టిగా కేక వేసారు.

ఆ సరికి అమ్మమ్మ అనంతలక్ష్మి చల్ల కవ్వంతో పాటు పరుగెత్తుకుని వచ్చింది.

రాధను చూస్తూనే కళ్ళనీళ్ళు పెట్టుకుని

"అదేమిటే రాధా? అలా చిక్కిపోయావు? ఇన్నాళ్ళకి గుర్తొచ్చామా, నాలుగేళ్ళవలేదూ నువ్వు వచ్చి"అని రాధ చెంపలూ, ముఖమూ తడిమి చూసి అంది. "లోపలకి రండమ్మా, రా నాన్నా? ఎవరూ మన విజయే, ఎంతవాడవయ్యావురా? ఇంచుమించు పదేళ్ళయింది వీడిని చూసి, కిందటిసారి నువ్వు వచ్చినప్పుడు వీడు రానేలేదు. ఇప్పుడేం చదువుతున్నావు రా? పదా, పదకొండా?" అమాయకంగా అడుగుతున్న అమ్మమ్మని చూసి నవ్వుతూ అన్నాడు.

"నాలుగై ఐదు అమ్మమ్మా" అని.

"అమ్మా వాడు ఇప్పుడు ఉద్యోగం చేస్తున్నాడు. మొన్ననే ఆఫీస్ పని మీద టూర్ వెళ్ళి వచ్చాడు, కొన్నాళ్ళు సెలవుండడంతో నేనే 'నువ్వు వచ్చి చాలా రోజులయింది' అని పోరు పెట్టి తీసుకుని వచ్చాను" నవ్వుతూ అంది రాధ.

రాధ ఆ ఇంటి పెద్ద కొడుకు కామేశ్వర శర్మ గారి కూతురు. ముందు హైదరాబాద్ లోనే ఉన్నా గత పదిహేనేళ్ళుగా అమెరికాలో ఉంటోంది. అందువల్లనే మూడు నాలుగేళ్ళకొకసారి వస్తూ ఉంటుంది. రాధ భర్త అక్కడొక కంపెనీలో జనరల్ మానేజర్. ముగ్గురు పిల్లలామెకు. ఇద్దరు కొడుకులూ ఒక కూతురు. పెద్దవాడు విజయ్. చాలా ఏళ్ళ క్రితమే అక్కడకి వెళ్ళిపోయినా ఆమె తన ఊరును గురించి ప్రతీ రోజూ పిల్లలకో, భర్తకో చెప్పినవే మళ్ళీ చెప్తూనే ఉంటుంది. ఏడాదికోసారి వచ్చే తన తాతగారి తద్దినం అంటే రాధకెంతో ప్రత్యేకం. ఆమెకే కాదు, ఇంట్లో అందరికీ. అందుకే ఎన్నో ఏళ్ళ తరవాత తమ ఇంట్లో పెద్ద పండుగలా జరిగే ఆ కార్యక్రమానికి రావాలని పనిగట్టుకు మరీ వచ్చింది ఈసారి.

రాధ తాతగారు రామేశ్వర శాస్త్రి గారు పెద్ద పండితుడు, నాలుగు వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులూ ఆయన నాలికమీద ఎప్పుడూ నాట్యం చేస్తూనే ఉండేవి అని చెప్పుకుంటారు. ఆయన చేసినన్ని సార్లు సుందరకాండ పారాయణం కానీ, రామపట్టాభిషేకాలు కానీ చుట్టుపక్కల పది ఊర్లలోనూ ఎవ్వరూ చెయ్యలేదు. అడిగిన వారికి అప్పుచేసైనా సరే దానం చేసే అంతగా చేతికి ఎముక లేని వారు ఆయన. నోటి మాటనీ, తోటి మనిషినీ నమ్మడం తప్ప, వడ్డీలూ పత్రాలూ, తాకట్టులూ ఇవేమీ ఎరగరు. తన పదిమంది పిల్లలనే కాక, ఇద్దరు తమ్ముళ్ళనీ, చెల్లెలి నలుగురు పిల్లలనీ, పెంచి పెద్దచేసారాయన. దాదాపు ఎనభై ఏళ్ళు అందరితోనూ చేయెత్తి దండం పెట్టించుకునేట్టుగా బ్రతికిన చెయ్యెత్తు మనిషి. ఎప్పుడూ వచ్చే పోయే బంధువులూ, అలవాటుగా ఆనవాయితీగా జరిగే కార్యక్రమాలతో నిత్యకల్యాణం పచ్చతోరణంలా ఉండేది ఆయన లంకంత ఇల్లు.

వీధి సావడిలో ఉన్న తాత, మామ్మల నిలువెత్తు పటానికి నమస్కారం చేసుకుంది రాధ. విజయ్ కూడా, పట్టుపంచెతో, నుదిటిమీదా, పొట్టమీదా, చేతులమీదా విభూతి చారలతో, నుదిటిన ఎర్రటి బొట్టుతో సాక్షాత్తు పరమశివునిలా ఉన్న ఆయనను తదేకంగా చూసాడు.

" మొన్ననే కలర్ ఫోటో చేయించాడు మీ బాబయ్య జగన్నాధం" అన్నారు రాధ తండ్రి.

అప్పటికే రాధా, విజయ్ వచ్చిన విషయం తెలిసిన ఆమె ముగ్గురు బాబయ్యలూ, పిన్నులూ, తద్దినం కోసమని వచ్చిన అత్తయ్యలూ, మిగతా అందరూ అందరూ సావడిలోకి చేరిపోయారు.

"దాన్నో గ్లాస్ మంచినీళ్ళు తాగనివ్వండ్రా? అన్నీ ఇప్పుడే మాట్లాడెయ్యాలా? " పెద్ద అత్తయ్య కాస్త గట్టిగా అనేసరికి

"రావే రాధా! " అని పిన్నులు లోపలకి తీసుకెళ్ళారు.

విజయ్ ఇల్లంతా తిరిగి పరిశీలిస్తున్నాడు. ఆర్కిటెక్చర్ ఇంజినీర్ అతను. ఈ వందేళ్ళ పాత ఇల్లు, కేవలం మట్టి, సున్నం ఇటుకలూ కలిపి కట్టినది ఇంత గట్టిగా ఇన్నేళ్ళు ఎలా ఉందా? అని అతనికెప్పుడూ ఆశ్చర్యమే. ఎత్తైన గుమ్మాలూ, అరుగులూ, చల్లటి గచ్చు, మధ్యలో మండువాలూ (స్కైలిట్లంటారు ఇప్పుడు), ఎత్తుగా లేపిన కప్పులూ, కావలసిన చోట్ల అటకలూ, చక్కగా అల్లిన వెదురు పెణక, దానిమీద వత్తుగా వాటంగా పరిచిన పెంకులూ. 'మనం ఇకో ఫ్రెండ్లీ అంటూ కొత్తగా చేస్తున్నదేమీ లేదు' అనిపించింది అతనికి. వెళ్ళేలోపల మంచి ఫోటోలు తీసి పట్టుకెళితే మంచి కేస్ స్టడీగా చూపించవచ్చు అనుకున్నాడు.

ప్లేట్లో మెత్తగా దూదిపింజల్లా ఉన్న మజ్జిగట్లు, తేనె పానకం, ఆవకాయ నెయ్యి వేసి అమ్మమ్మ తీస్కుని వచ్చింది.

"ఒరే విజూ, నువ్వు ఎప్పుడూ ఇష్టంగా తినేవాడివి చిన్నప్పుడు గుర్తుందా, దా ఈ నాలుగట్లు తిను" అంది.

వంటింటి గడపకివతల అమ్మతో పాటు కూర్చుని తినేసాడు అవి. వేడి వేడి నీళ్ళు పోసుకుని వచ్చేసరికి కళ్ళనిండా కూరుకుని వచ్చింది నిద్ర.

"అమ్మా ఇంక నావల్ల కాదు, పడుకుంటా" అన్నాడు.

"యూరోప్ టూర్ నించీ రాగానే నాతో వచ్చాడు కదా. ఒక్కోచోట ఒక్కొక్క టైం అందుకే అలిసిపోయాడు" అంది రాధ.

తాతయ్య పందిరి పట్టె మంచం మీద వాలగానే నిద్రపోయాడు. భోజనాల వేళ అవడం ఒక్కటే కాదు, అతనికి మెలకువ రావడానికి కారణం.. ఇల్లంతా విపరీతమైన హడావుడిగా ఉండడడం కూడ. అతను కళ్ళు నులుముకుంటూ గది లోంచి బయటకు వచ్చేసరికి మండువాలో ఎవరో కొత్తవాళ్ళు.

"అడుగో రాధ కొడుకేనా, ఎప్పుడో ఇంతప్పుడు చూసాను, ఏరా? బావున్నావా?" చనువుగా అడుగుతున్న అతనెవరో తెలీలేదు.

"మా బాబయ్యరా, రాఘవరావు బాబయ్య" అంది రాధ ఆనందంగా.

"ఓహో.. నమస్తే అండి" అన్నాడు చిన్నగా.

"ఆలమూరు లో ఉంటారు" అంది తనే.

మధ్యాహ్నం భోజనాల వేళకి ఇంట్లో వాళ్ళూ, చుట్టాలూ కలిసి పాతిక మంది పైన తేలారు. విజయ్‌కి చాలా ఆశ్చర్యం వేసింది. వేరే ఊర్లనించి తద్దినం కోసం వచ్చారు వీళ్ళందరూ, అదీ రెండు రోజులు ముందే, అంటే అతనికి చాలా వింతగా ఉంది. పైగా అమ్మకి సొంత బాబయ్యలు కాదు, చిన్న తాతగారి పిల్లలుట. తద్దినం ఎల్లుండి. 'ఇంకా ఎంతమంది వస్తారో ?' అనుకున్నాడు.

భోజనాలు అయ్యి మగవాళ్ళు కునుకులు తీస్తున్నారు. ఆడవాళ్ళు నట్టింట్లో కొంగులు పరుచుకుని నడుములు వాల్చి ' ఎల్లుండికి ఏం కావాలి? ఎలా చెయ్యాలి' అని మాట్లాడుకుంటున్నారు. తద్దినం ముందు రోజు రాత్రి ఫలహారం కాబట్టి కొట్టెక్క బుట్టలు చెయ్యడానికి నిర్ణయించారు. తద్దినం నాడు 'గారెలకెంత పప్పు పొయ్యాలి? అరిసెలకి ఎంత బియ్యం తడిపితే సరిపోతుంది? మావిడికాయలు పచ్చడా? పచ్చడి ముక్కలా? మావగారికి మావిడి పళ్ళంటే ప్రాణం కనక అవి తప్పకుండా ఉండాలి' ఇలా సాగుతున్నాయి వాళ్ల కబుర్లు. ఇల్లు కడిగి కావలసిన సామానంతా అటకమీదనించి దింపారు.

రాధ రెండో అత్తయ్య పేరు అన్నపూర్ణమ్మ. ఆవిడ చాలా చలాకి మనిషి. ఒక్క క్షణం ఖాళీగా కూర్చోలేదు. వచ్చిన వెంటనే చెప్పేస్తుంది ఆవిడ. 'ఇదిగో ఏమర్రోయ్, ఇవ్వాల్టికి సరిగ్గా నాలుగో నాడు నా ప్రయాణం. బండే ఎక్కిస్తారో, బస్సే ఎక్కిస్తారో మీ ఇష్టం'

అంటుంది తమ్ముళ్ళతో. అంతే ఆరు నూరైనా ఆ ప్రయాణం మారదు ఇంక. పెద్దవాళ్ళతోనూ, పిల్లలతోనూ ఒక్కటే తీరుగా ఉండగలదు ఆవిడ. ' రండర్రా రాత్రికి బుట్టలు కుడదాం' అని పిల్లలందరినీ పోగేస్తుంది ఆవిడ.

నాలుగేసి పనసాకుల్ని వెదురు పుల్లలతో చక్కటి బుట్టలుగా కుట్టి, దాంట్లో బియ్యపు రవ్వ కలిపిన మినప్పిండిని వేసి ఆవిరి మీద ఉడికించి తీసాక వాటిని గానుగనూనే, కొబ్బరి కాయ మావిడికాయ పచ్చడి, తియ్యటి తిమ్మనాలతో తింటే స్వర్గానికి ఎంత దూరం అన్నదానిమీద పందెం వేసుకోవచ్చు. కావలసినవి పదీ, పరకా కొట్టైక్క బుట్టలైతే అయితే ఇంటి వాళ్ళే కుట్టేసుకుంటారు. కానీ చిన్నా పెద్దా కలిసి ముప్ఫై మందికి పైన ఉంటే?? అందుకే ఆ పని ఆవిడ తీసుకునేది. ఇదే కాదు పదిమందితో ఏ పని చేయించాలన్నా దానికి కావలసిన ఓర్పు నేర్పు ఆవిడకున్నట్టుగా ఇంట్లో మరెవరికీ లేవు. గొప్ప ప్రోజెక్ట్ మానేజర్ అన్నమాట.

'భద్రన్న కాపుతో వెళ్ళి మంచి ఆకులు కోసుకురండర్రా' అని పెద్దపిల్లల్ని మూడు నాలుగు తోకబుట్టలిచ్చి తోటకి తరిమేది. ఈలోపున ఆవిడ ఎడంచేత్తో కత్తి పట్టుకుని వెదురు ముక్కల్ని వాటంగా సన్నటి పుల్లలుగా చీల్చేది. ఆకులొచ్చాకా, వాటిని శుభ్రంగా కడిగి నీడలో ఆరనివ్వడం ఆడపిల్లల పని. తరవాత అందరినీ గుండ్రంగా కూర్చోపెట్టేది పెరటి సావిట్లో ఇంటి వాళ్ళ పనికి అడ్డు రాకుండా. ఐతే ఏం? 'గల గలలాడుతున్న గోదారికే సందడైనట్టు' ఆవిడ ఎక్కడుంటే అందరూ అక్కడకే చేరేవారు. 'నాలుగేసి ఆకులు సమానంగా వత్తు పెట్టండర్రా' అని చిన్నపిల్లలకి చెప్పేది. వాళ్ళు అలా పెట్టి ఇచ్చిన ఆకులని మూలలు సరిగ్గా మడుస్తూ బుట్టలుగా ఎలా కుట్టాలో పెద్దపిల్లలకి చూపిస్తూ తను కూడ కలిసి కుట్టేది. అలా అంచెలంచలుగా దశలవారిగా ఒక చిన్న కుటీర పరిశ్రమని తలపిస్తూ సాగేది బుట్టలు కుట్టే ప్రక్రియ.

'అలా కాదే సూరీ, మూల సరిగ్గా మడవకపోతే పిండి కారిపోతుంది, చూసావా ఇలా ఏ ఆకు పైకి మడవాలో చూసుకోవాలి' అని దగ్గరుండి చూపించేది. 'బళ్ళో పెద్ద పెద్ద లెక్కలు క్షణాల్లో చేసేస్తారు. మరి ఇవీ లెక్కలేనర్రా,' అనేది నవ్వుతూ. ఎవరు కాస్త బాగా చేసినా సరే, 'శభాష్, అదీ లెక్క!, చూసారా మన అమ్మలెంత బాగా కుట్టిందో. మీకిదో లెక్కటర్రా?'అని మెచ్చుకుంటుంటే పిల్లలందరూ పోటీ పడేవారు. ఇలా సందడిగా, సంబరంగా సాగిన వ్యవహారాన్ని సరదాగా చూశాడు విజయ్.

మర్నాడే తద్దినం. వక్కలంకనించీ, అనాతారం నుంచీ, నందంపూడి నించీ, ఇటు ఆదుర్రూ, పేరూరూ ఇలాంటి ఊర్లనించీ బండ్లలో దిగారు మరింతమంది బంధువులు.

"అమ్మా ఇదేమైనా పెళ్ళా? ఇలా ఊర్లనించీ రావడానికి? ప్రతీ ఏడూ ఉండేదే కదా? " రహస్యంగా అడిగాడు తల్లిని.

"తప్పు ఒరే, తాతగారంతటి మహానుభావుడి ఏడాదికోసారి జరిగే సత్కారం. అందుకే అందరూ వస్తారు" అంది రాధ.

పొద్దున్నే పెద్దవాళ్ళకి కాఫీలు, పిల్లకి చద్దన్నాలు మిగిలిన బుట్టలూ, రాధా మరొకరూ పెట్టారు. పిల్లలందరూ కడుపులో చద్దన్నం పడగానే పొలాలకి పరుగు.

అమ్మమ్మా, చిన్న అమ్మమ్మలూ, మిగతా ఆడవాళ్ళూ పొద్దు పొడవకుండానే, తడి, మడి బట్టలు కట్టుకుని తల మునకలయ్యేంత పనిలో పడిపోయారు కంటికైనా కనిపించకుండా. నలుగురు వంతులవారీగా పిండి కొడుతుంటే, ఇద్దరు చెయ్యి మార్చుకుంటూ గారెల పప్పు రుబ్బుతున్నారు. పని జరుగుతున్నంతసేపూ, తండ్రినీ, తల్లినీ తలుచుకుంటున్నవాళ్ళు కూతుళ్ళయితే, వాళ్ళకంటే మమ్మల్ని ప్రేమగా చూసుకునేవారు మా మావగారు అని కోడళ్ళు పందేనికొస్తున్నారు.

"నాకు బంగనపల్లి మావిడిపండు తప్ప సయించదని ఎప్పుడూ మా మావగారు ముందు నాకే ఇచ్చేవారు" అమ్మమ్మ చిన్నపిల్లలా చెబుతోంది.

"అంతేనా? మాలో ఎవ్వరం జ్వరం వచ్చి లంఖణం చేసినా ఆయనే స్వయంగా బియ్యం వేయించి జావ చేసి ఇచ్చేవారు పధ్యానికి" అని చిన్న అమ్మమ్మా, "మా అన్నయ్య ఉన్నప్పుడు తోటంతా నందనవనంలా ఉండేది" అని చెల్లెలూ ఇలా ఏదో ఒకటిగుర్తు

చేసుకుంటూనే ఉన్నారు. ఇద్దరు మొగవాళ్ళు రెండు పనసకాయలని పొట్టుగా కొడుతున్నారు కూరకి. గురువుగారు, ఆయనతోటి మరో నలుగురు బ్రాహ్మలు వచ్చారు.

"ఎలా ఉందిరా నీ వ్యవసాయం?" ఎవరో సుబ్బారావుని అడిగారు.

"నాదేముంది? మా రాముడు బాబు చలవ.. దున్నుకోరా అని రెండెకరాలు నాకిచ్చేసాడు గుళ్ళో రాముడు సాక్షిగా మరో మాటైనా అడగకుండా. ధర్మాత్ముడి చెయ్యి ఊరికే పోతుందా, అదే ఇప్పుడు నాకు పదెకరాలయింది" అన్నాడు ఆయన పైకి చూసి దండం పెడుతూ.

"మరే, నా పిల్ల పెళ్ళికి మాత్రం, మనలో మనకి మొహమాటాలేమిట్రా? నా పిల్లలతో పాటే అనుకుంటాను అని మెడకో గొలుసు, దానికో మంగళసూత్రం చేయించి ఇచ్చాడు కనకనే నా పిల్ల ఇంత శుభ్రంగా ఉంది అన్నాడు" నరసింహం.

"ఆయన ఉన్నప్పుడూ ఇంతేకదూ, ప్రతీ రోజూ పండగలానే ఉండేది, ఇప్పుడాయన పోయిన రోజూ పండగలాగే నడుస్తోంది, ప్రతీ ఏడూ మహానుభావుడు ! " భక్తిగా అనుకున్నారు వచ్చిన వాళ్ళు.

అటూ, ఇటూ తిరుగుతూ, వాళ్ళనీ, ఇంటినీ ఫోటోలు తీస్తూ తిరుగుతున్న విజయ్‌ని అందరూ నవ్వుతూ పలకరించారు.

"మనరాధ కొడుకు, ఎంతవాడయ్యాడో, అమెరికాలోనే ఉద్యోగంట, పెళ్ళికొడుకు. మనవాళ్ళ పిల్లెవరైనా ఉంటే చూడండ్రా" అని వేళాకోళం ఆడారు.

వాళ్ళల్లో కొంతమందిని తను గుర్తు పట్టలేకపోయినా మాటల్లో ఆప్యాయతని గుర్తించగలిగాడు. ఇంకాసేపు వాళ్ళెదురుగా ఉంటే నిజంగానే అన్నంతపనీ చేసేస్తారేమోనని భయపడ్డాడు కూడా.

తన తాతగారు, చిన్నతాతలు అందరూ వయసు వారీగా వరసగా కూర్చుని అత్యంత భక్తిశ్రద్ధలతో గురువుగారు జరిపించిన తతంగాన్నంతా చెయ్యడం ఆసక్తిగా చూసాడు. తంతు అంతా పూర్తి అయ్యి గురువుగారు పేరు పేరునా అందరికీ తెల్ల అక్షింతలు వేసిన తర్వాత భోజనాలు. నలుగురు బ్రాహ్మలు, ఊరిలో వాళ్ళు, వచ్చిన వాళ్ళు, ఆడవాళ్ళు, పిల్లలూ ఇలా మొత్తానికి డెబ్భై మందికి పైనే తేలారు. నాలుగు కూరలు, పచ్చళ్ళు, గారెలు, అరిసెలు, నువ్వుండలూ, మామిడి పళ్ళూ, పనసతొనలూ ఇలా. అందరిదీ అయ్యేసరికి నాలుగైంది టైము. అప్పుడు కనిపించింది అమ్మమ్మ. పనివాళ్ళకి పెట్టి, సాయంత్రం వెళ్ళిపోతామన్నవాళ్ళకి 'ఇదిగో, మా మావగారి ప్రసాదం, పిల్లలకి' అంటూ పొట్లాలు కట్టి , ఇవన్నీ అయ్యేసరికి అయిదు దాటింది. చల్లబడ్డాకా వాకిట్లో కూర్చున్న తాతగారి దగ్గర చేరాడు. "ఏరా నాన్నా, అయిందా నీ ఫోటోలు తియ్యడం?" నవ్వుతూ పలకరించారు. చిన్నగా నవ్వాడు.

బంధువులందరికీ పక్కలూ, దుప్పట్లు, తరగడాలూ అమర్చడంలో హడావుడిగా ఉంది అమ్మమ్మ. పెద్దవాళ్ళకి వాకిట్లో పట్టెమంచాలూ, నులక మంచాలూ, మడతమంచాలూ, కొద్దిగా చిన్నవాళ్ళకి వాకిటిని ఆనుకుని వున్న అరుగుమీద పరుపులూ, బొంతలూ, ఆడవాళ్ళకీ, పిల్లలకీ మండువాలో, నడవలో బరకాలూ ఇలా రకరకాల ఏర్పాట్లు. మర్నాడు కాఫీలు తాగి కొందరూ, భోజనాలు చేసి కొందరూ బయలుదేరి వెళ్ళారు వచ్చిన వాళ్ళందరూ. అంతా సవ్యంగా జరిగిందన్న తృప్తితో కూర్చున్నారు అమ్మమ్మా, ఆవిడ తోడికోడళ్ళు, ఆడపడుచులూ..

కాళ్ళకి కొబ్బరి నూనె రాసుకుంటున్న అమ్మమ్మ పక్కన చేరాడు విజయ్.

"అబ్బ ఒక పెద్ద సునామీ వచ్చి వెళ్ళినట్టు ఉంది" అన్నాడు నవ్వుతూ.

"తప్పు" అన్నట్టు చూసింది రాధ.

"పరవాలేదు లేమ్మా, చిన్నవాడు కదా, వాడికేం తెలుసు చెప్పు?" అన్నారు ఆమె తండ్రి.

"మీరిలాగే చిన్నవాడంటారు, నిన్నటినించీ నా బుర్ర తినేస్తున్నాడు. ఇంత హడావుడేమిటమ్మా, ప్రతీ ఏడాది ఉండేదానికి? వీళ్ళందరికీ పనులేమీ ఉండవా? ఇలా రోజుల తరబడి రావడానికి? అంటూ, మీరైనా చెప్పండి నాన్నా, వాడికి" అంది చిరుకోపంతో రాధ.

"కాళ్ళు నొప్పా అమ్మమ్మా? నేను మర్దనా చేస్తాను ఉండు పాపం నిన్నంతా అలిసిపోయారు మీరంతా" అని ఆమె చేతిలోంచి నూనె సీసా తీసుకున్న కొడుకును చూస్తూ.

తల్లి మాటలకొద్దిగా చురుగ్గా తల పైకెత్తి చూసి నెమ్మదిగానే అన్నా సూటిగానే అన్నాడు.

"నిజంగానే తాతయ్యా, నేను పెద్దవాడినయ్యాకా తద్దినం చూడలేదు మన ఇంట్లో. ఎప్పుడూ అమ్మ చెప్పడమేగానీ, మా ముత్తాతగారిది ఇలా జరిగేది, మా తాతగారిది ఇలా జరుగుతుంది అని. ఇప్పుడు చూస్తే నాకు నిజంగా చాలా ఆశ్చర్యం వేసింది. ఎంత హడావుడి? ఎంత మంది? ఎంత పని? ఎంత డబ్బు అని? నిజంగా ఇంతలా చెయ్యాలా తాతయ్యా? ఇంతమంది వస్తే కానీ అది జరిగినట్టుకాదా? కనీసం పదిమంది నిన్నటినించీ వంటపనిమీదా ఉన్నారు కదా. దీని అర్థం ఏమిటి? ఈ తతంగం వెనకాల ఏముంది? దీని ప్రాముఖ్యత ఏమిటి? " అన్నాడు.

ముఖం మీద చెరగని చిరునవ్వుతో మనవడిని చూస్తూ అన్నారు రాధ తండ్రి.

"ఒరే బాబూ, నిజానికి నువ్వడిగిన ప్రశ్నలన్నింటికీ నా దగ్గర సమాధానం ఉందో లేదో నాకు తెలీదు, అయినా నాకు తెలిసినంతలో చెప్పడానికి ప్రయత్నిస్తాను. అసలు తద్దినం అంటే ఏమిటి? తత్ + దినము. అంటే ఈ లోకంలో తమ పనులన్నింటినీ ముగించుకుని మనవాళ్ళు మనల్ని వీడి ఏ రోజు వెళ్ళిపోయారో ఆ రోజున వారిని మొక్కుబడిగా కాకుండా, భక్తితోనూ, నియమనిష్టలతోనూ తలచుకోవడమే దీని ముఖ్య ఉద్దేశ్యం అని నా అభిప్రాయం. మన వెంటనుండి, దారి చూపి నడిపించేది, మన నడవడికను గానీ, జీవన గమనాన్నిగాని నిర్దేశించేది మన వంశపు పెద్దలే కనక వారిని సగౌరవంగా ఆహ్వానించి సముచితంగా సత్కరించి మీరెప్పుడూ మా మనసులోనే ఉన్నారు సుమా అని తెలియచేసుకోవడమే ఇది. నీ భాషలో చెప్పాలంటే 'రిమెంబరెన్స్' అన్నమాట."

"రైటే, ఒప్పుకున్నాను. రిమెంబరెన్స్ వరకూ వరకూ ఓకే. కానీ ఆ పేరున జరిగిన హడావుడి మాటేవిటి? అంతకంటే ఆయన పేరుమీద నలుగురు పేదవాళ్ళకి అన్నదానం చేస్తే సరిపోదా? "అన్నాడు. తాతయ్య మాట్లాడలేదు. కళ్ళజోడు తీసుకుని ఒకసారి తుడుచుకుని మళ్ళీ సర్దుకున్నారు.

"నిజమే.. ఇదంతా నీకు అనవసర తతంగంలా కనిపించడంలో ఆశ్చర్యం లేదు కానీ ఇది తరతరాలుగా వస్తున్న నమ్మకం. ప్రతీ ఏడూ ఈ రోజున మా నాన్న మా ఇంటికి వస్తారనీ, మమ్మల్నీ, మా బిడ్డలైన మిమ్మల్నీ ఆశీర్వదిస్తారనీ నేనూ, నా తమ్ముళ్ళూ, మనస్ఫూర్తిగా నమ్ముతాము. ఆ నమ్మకాన్నీ, సంతోషాన్నీ మనవాళ్ళు అనుకునే నలుగురితో పంచుకోవాలని అనుకుంటాము. అంతే కాదు. మనుషులు తమ విత్తం కొలది, వైభవం కొలది, ఇష్టం కొలదీ చేసే దేవుని పూజలాగే ఇది. ఇంత స్కేల్ లో చెయ్యాలని కానీ, ఇంత మందిని పిలవాలని కానీ ఎవ్వరూ నిర్దేశించరూ, నిర్బంధించరు.. ఏదైనా మన ఇష్టం కొలదీ చేసేదే మిగతా దానధర్మాలు ఎన్ని ఆయన పేరున చేసినా దీని ప్రత్యేకత దీనిదే"

"కానీ తాతయ్యా, ఎప్పుడో పోయిన మీ నాన్నగారు మళ్ళీ ఎలా వస్తారు? " కొద్దిగా ఆశ్చర్యంగా అన్నాడు విజయ్.

తాతయ్య నవ్వారు.

"ఇక్కడ నేను ఆత్మ సిద్ధాంతం గురించి చెప్పను. నమ్మకాన్ని గురించి చెప్తాను. ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులందరూ ప్రతీ ఏడాది ఈస్టర్ పండుగ ఎంత ఆర్భాటంగా జరుపుకుంటారో నీకు తెలియనిది కాదు, దానికి కారణమేమిటంటావ్? ప్రతీ ఏడాది భగవంతుడు తిరిగి వస్తాడనీ, మనల్ని ఆశీర్వదిస్తాడనేగా. నిజంగా ఆయన వస్తాడా, రాడా? అన్న విషయం ప్రశ్న. ఆయన బిడ్డలమైన మనందరినీ చల్లగా

చూడటానికి తప్పకుండా వస్తాడు అనుకునేది నమ్మకం. దానిని మించిన అద్భుతం లేదు నన్నడిగితే. ప్రపంచాన్ని నడిపించేది నమ్మకమే కదా. కనిపించని దైవం విషయాన్ని పక్కన పెడితే, మనకి కనిపించే దైవాలైన తల్లితండ్రుల విషయమైనా అంతేకదా.

అంతే కాదు నాన్నా! మనిషి ఎప్పుడైనా సంఘ జీవి. మంచికైనా చెడ్డకైనా నలుగురి సాయం, సహకారమూ కావలనుకుంటాడు కదా! ఒంటరిగా ఏదీ సాధించలేడు, సాధించినది ఆస్వాదించనూ లేడు. తన సుఖమైనా, దుఖమైనా తన వాళ్ళు నలుగురితో పంచుకున్ననాడే  ఆనందిస్తాడు. అందుకే దూరాలు పెరిగిన కొద్దీ దగ్గరవ్వాలని తాపత్రయం ఎక్కువ అవుతుంది, కాదంటావా? సంవత్సరమంతా తమ తమ పనుల్లో తీరిక లేకుండా ఉన్నవారు ఈ ఒక్కరోజు మన ఇంటికి వచ్చినప్పుడూ, భోజనం చేసేటప్పుడూ  మన వాళ్ళనీ, వాళ్ళతో తమకున్న అనుబంధాన్ని గుర్తు తెచ్చుకుంటే అది మనకెంత సంతోషంగా ఉంటుంది? దీనివల్ల మనకేం వస్తుందీ? ఎం లాభం ఉందీ? అంటే నా దగ్గర జావాబు లేదు. ఎందుకంటే అన్నీ 'ఇన్ పుట్-అవుట్ పుట్' అనే దృక్పథంలోనే చూడలేము కదా.

మా నాన్న విషయానికొస్తే, అందరికీ ఎంతో ఆదర్శ ప్రాయంగా బ్రతికిన మా తండ్రిగారిని మాతో పాటు, మరో నలుగురు - ఆయన్నిష్టపడేవారూ, ఆయనకిష్టమైనవారూ స్మరిస్తే బావుంటుందనే చిన్న కోరిక. ఇదే ఆదర్శంగా తీసుకుని రేపు నా గురించి కూడా నా నట్టింట్లో నలుగురూ నన్నూ తలుచుకుంటారనే మరో చిన్న స్వార్థం మనందరిలోనూ ఉండడం  కూడా కారణమేమో. 'ఔట్ ఆఫ్ సైట్ ఈస్ ఔట్ ఆఫ్ మైండ్' అన్నది నీకు తెలుసు కదా. అందుకేనేమూ పాపం పుత్తడి బొమ్మ పూర్ణమ్మ కూడా నలుగురూ కలిసి నవ్వుకునే వేళ నన్నొకసారి తలుచుకోమంది.  ఆ తలుచుకోవడమే సింపుల్‌గా తత్+దినం అవుతుంది. అంతేనంటావా? ఇదే నాకుతెలిసిన సోషల్, ఎమోషనల్ అండ్ పర్సనల్ రీసన్స్ బిహైండ్ థిస్ రిమెంబరెన్స్ అన్నారు. ఎన్నో తరాలక్రితం ఏర్పరిచిన రెలిజియస్ కారణాలమీద కామెంట్ చేసేంత గొప్పవాడిని కానేకాదు నేను".

ఇంగ్లీష్ చదువుల మనవడికి అర్థమవ్వాలనే అలా  అన్నారు ఆయన.

"అదంతే, అలా చెయ్యాలని మన పెద్దవాళ్ళు చెప్పారు కుర్రవాడివి నీ ముఖం నీకేం తెలుస్తుంది?" అని కొట్టిపారేయకుండా తాతయ్య ఇచ్చిన వివరణని శ్రద్ధగా విన్న విజయ్‌కి చాలా విషయాలు అర్థం అయినట్టుగానే కాకుండా  "నా కొడుకు చెప్పినదంతా నిజం" అని ఫోటోలో ముత్తాతగారు 'అప్రూవ్' చేసినట్టుగా కూడా అనిపించింది.

